విశాఖపట్టణం
సోమవారం 12 జనవరి 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in | సంపుటి: 8 | సంచిక: 354 | వెల: రూ.5/- | పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## 2047 విజన్‌పై సమీక్ష



మంత్రులు, సెక్రటరీలతో సీఎం చంద్రబాబు నేడు సమావేశం

వర్చువల్‌గా హాజరుకానున్న జిల్లా కలెక్టర్లు

2



## టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్

### పవన్‌కు అరుదైన గుర్తింపు

### నిరంతర, దీర్ఘకాలిక అంకితభావానికి గౌరవం

(అమరావతి - జయజయహే)

పవన్ కళ్యాణ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్న సంగతి తెలిసిందే. తెలుగు సినీ రంగంలో నటుడిగా చెరగని ముద్ర వేశారు. నటుడిగా మాత్రమే కాకుండా రచయితగా, దర్శకుడిగా, స్టంట్ కోఆర్డినేటర్ గా, ..మిగతా 2లో

## అనకాపల్లినే నా అడ్డా!

### సీఎం రమేశ్ బిగ్ పొలిటికల్ స్కెచ్

### సొంత, శాస్వత నియోజకవర్గంగా యోచన

### కలిసివస్తున్న సామాజికవర్గ సమీకరణాలు

*సీఎం కంటే పవర్ ఫుల్ అనే డైలాగ్ వింటే చాలు ఆయన పేరు ఠక్కున గుర్తుకు వచ్చేస్తుంది పొలిటికల్ సర్కిల్స్ కు. ఆయన మరెవరో కాదు.. అనకాపల్లి ఎంపీగా ఉన్న సీఎం రమేశ్. సీఎం రమేశ్ అంటే సీఎం కన్నా పవర్ ఫుల్ అనే డైలాగ్ తెలుగు స్టేట్స్ పాలిటిక్స్ లో చాలా ప్రాచుర్యంలో ఉంది. గతంలో తెలుగుదేశం పార్టీలో ఉంటూ చక్రం తిప్పగా, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీలోనూ తన హవాను ప్రదర్శిస్తున్నారు. పార్టీలు ఏదైనా సరే తన స్టైల్ తనదే అన్నట్లు సీఎం రమేశ్ వ్యవహరిస్తుంటారు*

(విశాఖపట్నం - జయజయహే)



రాజకీయాల్లో ఎవరైనా సరే ఒక్కో మెట్టు ఎక్కుతూ పైకి వస్తుంటారు. కానీ సీఎం రమేస్ అలా కాదు.. డైరక్ట్ టు ఎంపీ సీటు. ఇది ఆయన పొలిటికల్ స్టైల్. కేవలం ఎంపీగా ఉంటే ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలకు వెళ్లి రావడమే కదా.. ఏం చేయగలగుతారు అనుకుంటారు అంతా. కానీ సీఎం రమేశ్ గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎక్కడైనా, ఏదేనా చేయగలరు. ఆది ఆయన లాబీయింగ్ పవర్.

కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ తరుపున అనకాపల్లి జిల్లా పార్లమెంట్ సభ్యుగా ఉన్నారు. సీఎం రమేశ్ ఎప్పుడూ కూడా రాజకీయాల్లో ప్రజా క్షేత్రంలో బరిలోకి దిగి పోటీ చేయలేదు. ఎప్పుడూ రాజ్యసభ సభ్యుడుగానే నామినేట్ అవుతూ వస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో రాజ్యసభకు నామినేట్ అయ్యేవారు. గత టెర్మ్ లో కూడా టీడీపీ నుంచి పెద్దల సభకు వెళ్లగా, రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆకస్మికంగా బీజేపీలో చేరిపోయారు. అలా కేవలం రాజ్యసభ సభ్యుడుగా మాత్రమే రాజకీయాల్లో ఉన్న సీఎం రమేశ్ ప్రత్యక్షంగా పోటీ చేసి గెలిచినది లేదు. దీంతో ఆయన గత ఎన్నికల్లో సమయంలో కూటమి పార్టీల ఊపు చేసి నామినేట్ పదవులకు స్వస్తి చెప్పి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసారు. అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి అఖండ విజయంతో గెలుపొందారు. ఎక్కడో కడప జిల్లా నుంచి వచ్చి అనకాపల్లిలో ఎంపీ ఏంటి.. అంటూ తొలుత కొందరు విమర్శలు చేసినా, సీఎం రమేశ్ మెజార్టీ ఓట్లు చూసాక ఇక ఎక్కడా ఆ మాటే లేదు.

సహజంగా రాజ్యసభకు ..మిగతా 2లో

## బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీస్తే సహించం

### విశాఖ ప్రతిష్టను దిగజార్చవద్దు

### పోలుసుల పనితీరు ప్రశంసించిన సీఎం చంద్రబాబు

### పోలీసుల అదుపులో మహిళపై దాడి కేసు నిందితుడు

### మానసిక స్థితి సరిగ్గా లేదని ప్రాథమికంగా నిర్ధారణ

### స్పష్టమైన ఆధారాలు లేకున్నా కేసు ఛేదించిన పోలీసులు



(అమరావతి - జయజయహే)

విశాఖపట్నంలో ఓ మహిళపై జరిగిన దాడి వెనుక వాస్తవాలను ఛేదించి, నిందితుణ్ని అదుపులోకి తీసుకున్న విశాఖ నగర పోలీసులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. రెండు రోజుల క్రితం విశాఖలో విజయదుర్గ అనే మహిళను జగదాంబ సెంటర్‌లో ఓ వ్యక్తి దాడి చేసి, దుర్భాషలాడినట్టు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై తక్షణమే ..మిగతా 2లో



## రాష్ట్రానికి అమృత భారత్ రైళ్లు

### ఏపీ మీదుగా 3 రైళ్ల రాకపోకలు

### తమిళనాడు నుంచి బెంగాల్‌కు

### ప్రారంభించనున్న ప్రధాని మోడీ

3




## మయన్మార్‌లో ఉద్యోగాల పేరిట దగా

### మోసపోయిన 27 మంది యువకులు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి సమాచారం

### ప్రత్యేక చొరవ తీసుకుని రప్పించిన మంత్రి

### క్షేమంగా స్వస్థలాలకు చేరుకున్న బాధితులు


(విశాఖపట్నం - జయజయహే)

ఉద్యోగ అవకాశాల పేరుతో మయన్మార్ వెళ్లి మోసపోయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 27 మంది యువకులు ఎట్టకేలకు స్వదేశానికి చేరుకున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవతో ఈ యువకులు సురక్షితంగా భారత్‌కు తిరిగి వచ్చారు. మయున్మార్‌లో నెలల తరబడి నరకయాతన అనుభవించిన ..మిగతా 3లో

## అదే రద్దీ..!

### కిక్కిరిస్తున్న బస్సులు, రైళ్లు

### హైవేపై బారులు తీరిన వాహనాలు.. టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్



(హైదరాబాద్ - జయజయహే)

హైదరాబాద్ నుండి ఆంధ్రాకు వెళ్లే ప్రయాణికులతో సంక్రాంతి పండుగ వేళ హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజాము నుంచే వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వాహనాలు వేగంగా ముందుకు సాగేలా అధికారులు అదనపు టోల్ బూత్‌లను అందుబాటులోకి తెచ్చారు. శనివారం సాయంత్రం నుంచి ..మిగతా 3లో



## వాటర్ వార్.. ఎండ్

### ఇద్దరు సీఎంలదీ ఒకే మాట

### పరిష్కారానికి పరస్పర సహకారం

2

For a pure tomorrow.. జయజయహే

# అనకాపల్లినే నా అడ్డా!



మొదటి పేజీ తరువాయి...

మాత్రమే పని చేసిన ఆయనకు పెద్దగా ప్రజలతో సంబంధాలు నెరిపే అవసరం ఉండదు. కానీ ఇక్కడ అనకాపల్లి లోక్ సభ స్థానానికి పోటీ చేసి గెలిపిచిన తర్వాత ఆయన ప్రజలతో టచ్ లో ఉంటారా.. లేక.. పెద్దల సభ నేత తరహాలో వ్యవహరిస్తారా.. అన్న అనుమానాలు అందరికీ కలిగాయి. ఎన్నికల్లో గతంలో ఎన్నడూ పోటీ చేయకపోయినా సరే రాజకీయాల్లో ఆరితేరిన సీఎం రమేశ్ తన పొలిటికల్ ఫ్యూచర్ పై డెప్త్ గా ఫోకస్ చేసారు. ప్రజలతో నిత్యం టచ్ లో లేకుంటే లాంగ్ టెర్మ్ పాలిటిక్స్ లో కష్టాలు తప్పవని గ్రహించి అనకాపల్లి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. అంతేకాదు ఇక్కడే బిగ్ పొలిటికల్ స్కెచ్ కూడా వేసారని ఆయన అనుచర వర్గాలు చెబుతున్నాయి. సీఎం రమేశ్ తనకు శాశ్వతంగా అనకాపల్లి స్థానాన్నే నియోజకవర్గంగా చేసుకునేందుకు ప్లాన్ చేసారట. తనకు ఇకపై సొంత నియోజకవర్గం అనకాపల్లినే అన్న సంకేతాలను ఎంపీ సీఎం రమేశ్ పరోక్షంగా ఇస్తున్నారట. చంద్రబాబుకు కుప్పం, జగన్ కు పులివెందుల తరహాలో సీఎం రమేశ్ అంటే అనకాపల్లి పార్లమెంట్ స్థానం అన్న రీతిలో ఉండాలన్న సంకల్పంతో ఆయన గ్రౌండ్ లెవల్ లో వర్క్ చేసుకుపోతున్నారని క్యాడర్ చెప్పుకుంటున్నారు. రాజకీయాల్లో తనకంటూ ఓ శాస్వతమైన స్థానం లేకుంటే, ఎన్నికలు వచ్చిన ప్రతీ సారీ నియోజకవర్గాన్ని వెతుక్కోవడం, అక్కడ మళ్లీ అందరితో సంప్రదింపులు, రాజకీయాలు చేయడం చాలా కష్టమైన పని అని భావిస్తున్నారట. అదే ఒకటే స్థానాన్ని నమ్ముకుంటే ఎన్నికల సమయంలో రాజకీయాలు, మిగిలిన సమయంలో అభివృద్ధిపై దృష్టి పెట్టి ప్రజల పల్స్ పట్టవచ్చునని సీఎం రమేశ్ యోచిస్తున్నారట

సీఎం రమేశ్ అనకాపల్లిపై అంతలా నమ్మకం పెట్టుకోవడానికి చాలా కారాణాలున్నాయని పొలిటికల్ సర్కిల్స్ లో కూడా టాక్ నడుస్తోంది. గత ఎన్నికల్లో అనకాపల్లి స్థానం నుంటి టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ పోటీ చేసేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. కానీ అనూహ్యంగా ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీజేపీ తరుఫున బీ ఫామ్ పట్టుకుని సీఎం రమేశ్ వచ్చి వాలిపోయారు. అనకాపల్లిపై సీఎం రమేశ్ ఫోకస్ పెట్టడానికి రాజకీయ, సామాజిక, ఆర్థిక కారాణాలు చాలానే ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అనకాపల్లిలో బీసీ ఓటర్లు అత్యధికం. బీసీలు ఎవరి పక్షనాఉంటే వారికే పట్టం. సీఎం రమేశ సామాజాకివర్గానికి చెందిన ఓట్లు కూడా అధికంగానే ఉన్నాయి. అటు తెలుగుదేశం పార్టీకి అనకాపల్లి కంచుకోట. ఇక్కడైతే తనకు ఎలక్షన్ చేయడం చాలా ఈజీగా సీఎం రమేశ్ భావిస్తున్నారట. అనకాపల్లిని తన సొంత, శాస్వత నియోజకవర్గంగా మార్చుకునేందుకు వేసిన ఎత్తుగడ కూడా రాజకీయంగా లాభమే. ఆయన క్యాంప్ ఆఫీసు పెట్టి నిత్యం ప్రజలకు తన తరుఫున అధికారులు, అనచరులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. తరుచూ నియోజవకర్గంలో పర్యటనలు చేస్తూ గ్రామగ్రామాన పథకాలపై ప్రచారం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ ఇళ్లలో శుభకార్యాలు, పరామర్శలు ఉంటే నేరుగా సీఎం రేమేశ్ హాజరవుతుంటారు. ఆయనకు తీరిక లేకుంటే ఆయన సొదరుడు, కుమారుడు రిత్విక్ ను రంగంలోకి దించుతారు. అలాగే కూటమి ప్రభుత్వం హయాంలో అనకాపల్లి జిల్లాలో అర్సలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బస్క డ్రగ్ పార్కు, డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా ప్రాజెక్టులు పెద్దపెద్దవిగా రానున్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ అనుమతులుతో రావలాస్సినవే. ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు చేస్తున్న కృషిని కూడా సీఎం రమేశ్ గట్టిగానే ప్రచారం చేసుకుంటున్నారు. ఈ అంశాలన్నీ పరిశీలించిన తర్వాత అనకాపల్లి స్థానాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని తన పర్మినెంట్ స్థానంగా మార్చుకునే ఎత్తులు సీఎం రమేశ్ వేస్తున్నారనే టాక్ ఇటీవల ఊపందుకుంది. అయితే సీఎం రమేశ్ అంటే సీఎం కంటే పవర్ ఫుల్ అనే ట్యాగ్ తో వైరల్ అవుతున్నా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అన్ని వేళలా బాగా ఆదరించినా సరే, ఎన్నికల సమయం వస్తే మాత్రం స్థానికులు.. స్థానికేతరులు అనే నినాదాన్ని పావుగా వాడుతారు. మరి పవర్ ఫుల్ లీడర్ సీఎం రమేశ్ ప్రత్యర్థులు, సొంత పార్టీలో ఉండే ఆశవాహులు విసిరే పావును ఎలా ఎదుర్కొంటారో చూడాలి మరి.



# 2047 విజన్‌పై సమీక్ష

## మంత్రులు, సెక్రటరీలతో సీఎం చంద్రబాబు నేడు సమావేశం

## వర్చువల్‌గా హాజరుకానున్న జిల్లా కలెక్టర్లు

(అమరావతి - జయజయహే)

రాష్ట్ర మంత్రులు, సెక్రటరీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సమావేశం కానున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు సచివాలయంలో వారితో సమావేశం అవుతారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా హాజరుకానున్నారు. జీఎస్డీపీ, 2047 విజన్‌లోని 10 సూత్రాలపై సంబంధిత అధికారులు సమావేశంలో ప్రజంటేషన్ ఇస్తారు. అనంతరం ఆదాయార్జన, కేంద్ర ప్రాయోజిత పథకాలు, పీపీపీ విధానంలో ప్రాజెక్టులు, పెట్టుబడులు, దస్త్రాల పరిష్కారం, ఆన్‌లైన్ సేవలు, వాట్సాప్ గవర్నెన్స్ వంటి అంశాలపై సీఎం సమీక్షిస్తారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, సర్వే, ఫిర్యాదుల పరిష్కారం, రిజిస్ట్రేషన్ సేవలు, బ్లాక్ చైన్ విధానంతో ప్రజల ఆస్తులకు రక్షణ వంటి వాటిపై అధికారులు, మంత్రులకు దిశానిర్దేశం చేస్తారు. అదే విధంగా ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన వీబీ-జీ-రామ్ జీ పైనా మంత్రులు, అధికారులతో సీఎం చర్చిస్తారు. సమావేశం అనంతరం సాయంత్రం సంక్రాంతి పండుగకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వగ్రామం నారావారిపల్లెకు వెళ్తారు.




# టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్

మొదటి పేజీ తరువాయి...

కొరియోగ్రాఫర్ గా, గాయకుడిగా ఇలా పలు విభాగాల్లో తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రజా నాయకుడిగా మన్ననలు పొందుతున్నారు. మార్షల్ ఆర్ట్స్ లోనూ ప్రావీణ్యులైన పవన్ కళ్యాణ్, ఓ అరుదైన ఘనతను ఖాతాలో వేసుకున్నారు. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ అయిన 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొందడం ద్వారా ఒక గొప్ప అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన క్రమశిక్షణతో సాగించిన సాధన, పరిశోధన, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. సినిమాలు, రాజకీయాల్లోకి ప్రవేశించకముందే పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్ ప్రయాణం ప్రారంభమైంది. కరాటే, సంబంధిత యుద్ధకళల పట్ల అమితమైన ఆసక్తి కలిగిన పవన్ కళ్యాణ్, చెన్నైలో ఉన్న సమయంలో కఠినమైన శిక్షణతో పాటు నిరంతర సాధన చేసి, సాంకేతికంగా, తాత్వికంగా బలమైన పునాది ఏర్పరుచుకున్నారు. కాలక్రమేణా, శారీరక సాధనకే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి, అత్యంత నిబద్ధతతో వాటిని అనుసరించారు. మార్షల్ ఆర్ట్స్ పై ఆయన అవగాహన సినిమాల రూపంలోనూ ప్రతిబింబించింది. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, తమ్ముడు, ఖుషి, అన్నవరం, ఓజీ వంటి చిత్రాల ద్వారా ఈ మార్షల్ కళలను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తృత గుర్తింపు, ప్రజాదరణ తీసుకొచ్చారు. మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆయన చూపిన నిరంతర, దీర్ఘకాలిక అంకితభావాన్ని గుర్తించిన అంతర్జాతీయ సంస్థలు, పవన్ కళ్యాణ్‌కు పలు ప్రతిష్ఠాత్మక గౌరవాలు అందించాయి. జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటైన 'సోగో బుడో కన్‌రి కై' నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదవ డాన్) పురస్కారం లభించింది. అలాగే, జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సై'లోని 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. ఇది జపాన్ వెలుపల చాలా అరుదుగా లభించే గౌరవం. అంతేకాకుండా, గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ద్వారా ఆయనకు "టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్సు అనే విశిష్ట బిరుదుతో సత్కారం కూడా జరిగింది. అధునాతన శిక్షణలో భాగంగా, భారతదేశంలో జపాన్ యుద్ధకళలలో అగ్రగణ్యులలో ఒకరైన ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మూదీ వద్ద పవన్ కళ్యాణ్ శిక్షణ పొందారు. ఆయన మార్గదర్శకత్వంలో పవన్ కళ్యాణ్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం, లోతైన తాత్విక అవగాహనను సంపాదించారు. ఈ మైలురాయి ద్వారా సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రం.. ఈ మూడింటినీ అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్దిమంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. యుద్ధకళ సాధకులు, అభిమానుల దృష్టిలో కెంజుట్సులో పవన్ కళ్యాణ్ ప్రవేశం అనేది కేవలం ఒక గౌరవం మాత్రమే కాదు.. క్రమశిక్షణ, వినయం, నిరంతర అభ్యాసం వంటి విలువలతో నిండిన జీవితకాల ప్రయాణానికి ప్రతిబింబం. ఈ విలువలు మార్షల్ ఆర్ట్స్‌కు మాత్రమే కాకుండా పవన్ కళ్యాణ్ వ్యక్తిగత సిద్ధాంతాలకు కూడా లోతుగా అనుసంధానమై ఉన్నాయి.

# వాటర్ వార్.. ఎండ్

## ఇద్దరు సీఎంలదీ ఒకే మాట

## పరిష్కారానికి పరస్పర సహకారం



(హైదరాబాద్ - జయజయహే)

వాటర్ వార్.. తెలుగు స్టేట్స్ మధ్య ఉండే రెగ్యులర్ పంచాయితీ ఇది. ఈ మధ్య గులాబీ బాస్ కేసీఆర్ కామెంట్స్‌తో మళ్లీ రచ్చ అయింది. తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ కామెంట్స్..హరీశ్ కౌంటర్‌తో తెలంగాణలో రాజుకున్న నీళ్ల మంటలు ఏపీకి వ్యాపించాయి. అటు ఏపీలో నాలుగైదు రోజులు వార్ వార్ ట్రెండింగ్ అయింది. ఈ గట్టున మొదలైన పంచాయితీ..ఆ గట్టుకు హీటెక్కించింది. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీ వాటర్ వార్ పేరుతో డైలాగ్‌వార్‌కు దిగి మైలేజ్ కోసం ఎత్తుకు పైఎత్తులు వేశాయి. రేవంత్ వ్యాఖ్యలను బేస్ చేసుకుని చంద్రబాబుపై వైసీపీ అటాక్ చేస్తే..హరీశ్‌రావు కామెంట్స్ ఆధారంగా..వైసీపీపై టీడీపీ విమర్శల దాడి చేసింది. మీ హయాంలో అన్యాయం జరిగిందంటే..మీ హయాంలో అంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారు. ఆ రచ్చ..రాద్దాంతం అలా కొద్దిగా చల్లబడిందో లేదో..ఇటు ఏపీ సీఎం..అటు తెలంగాణ సీఎం ఇద్దరు..ఒకే రోజు ఒకే రకమైన స్టేట్‌మెంట్స్ ఇచ్చి చర్చకు దారితీశారు.

ఇద్దరు సీఎంలు ఒకే వాయిస్ వినిపించడం ఆసక్తికరంగా మారింది. పంచాయితీలు కంటే పరిష్కారం ముఖ్యమన్న తెలంగాణ సీఎం రేవంత్..తెలంగాణాకు నీళ్ళే కావాలని..వివాదాలు వద్దు అన్నారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ ప్రయోజనం పొందాలని భావించడం లేదన్న రేవంత్..చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని చెప్పుకొచ్చారు. అటు సీఎం చంద్రబాబు కూడా ఇదే అర్థం వచ్చేలా మాట్లాడారు. సముద్రంలోకి వెళ్లే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు అని ప్రశ్నించారు. నీళ్లు వద్దు గొడవలే కావాలని కొందరు బయల్దేరారని సెటైర్లు వేసిన బాబు..గొడవలు కాదు తెలుగు జాతి ప్రయోజనాలు ముఖ్యమంటూ స్పష్టం చేశారు.

అయితే ఇద్దరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నోట ఒకే మాట రావడం ఒక రకంగా పాజిటివ్ ఇండికేషనే. వాస్తవానికి నీటి పంచాయితీ ఇప్పటిది కాదు. ఎప్పుడు ఎండ్ కార్డ్ పడుతుందో తెలియదు. బేసిన్లు లేవు భేషజాలు లేవంటూ..మాజీ సీఎం కేసీఆర్ అప్పట్లో ఏపీ సీఎం జగన్‌తో సమావేశం తర్వాత స్టేట్‌మెంట్ ఇచ్చారు. రాయలసీమ రతనాల సీమ కావాలంటూ కూడా చెప్పుకొచ్చారు. అప్పటి సీఎంల భేటీ..నీళ్ల వివాదాన్ని కొలిక్కి తెచ్చిందో లేదో..వారి చర్చలు సఫలం అయ్యాయో, విఫలం అయ్యాయో ఇప్పటికీ క్లారిటీ లేదు. కానీ నీళ్ల లొల్లి మాత్రం..ఎప్పటికప్పుడు సరికొత్త టర్న్ తీసుకుంటుంది. అయితే చంద్రబాబు, రేవంత్ మధ్య సాన్నిహిత్యంతో..కృష్ణా, గోదావరి నదీ జలాలపై వివాదం పరిష్కారం అవుతుందా అన్న చర్చ మొదలైంది. కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్రతో ఇద్దరు సీఎంలు సామరస్య పూర్వక వాతావరణంలో జల జగడాలను పరిష్కరించుకునే దిశగా అడుగులు వేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. 2024 జూలై నెలలో ఏపీ, తెలంగాణ సీఎంల భేటీ జరిగింది. ఆ సమావేశంలో విభజన అంశాలు, షెడ్యూల్ 9లోని వివాదాలపై డిస్కస్ చేశారు. ఉద్యోగులు, ఆస్తుల విభజన అంటూ కొద్ది రోజులు హడావుడి నడిచింది. ఫైనల్ ఔట్ పుట్ ఏంటో ఇప్పటికీ స్పష్టత లేదు. అయితే ఇప్పుడు నీటి వాటాల విషయంలో ఇద్దరు సీఎంలు ఒకే తీరుగా స్పందించడం మాత్రం కాస్త సానుకూలమైన అంశం. ఏది ఏమైనా రెండు తెలుగు రాష్ట్రాలకు జీవ నదులు అయిన కృష్ణా, గోదావరి జలాలపై వివాదాల కంటే పరిష్కారాలే ముఖ్యమని బాబు, రేవంత్ కోరుకోవడం అయితే..ఆహ్వానించదగ్గ విషయమే. కాకపోతే వాటర్ వార్‌పై కూర్చొని మాట్లాడుకుని సమస్యను సాల్వ్ చేస్తారా? వాటర్ ఇష్యూ ఎప్పటికప్పుడు రాజకీయ అంశంగానే ఉండిపోతుందా అనేదే చూడాలి.



# బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీస్తే సహించం

మొదటి పేజీ తరువాయి...

స్పందించిన పోలీసులు... ఈ ఘటనకు కారణమైన వ్యక్తిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అయితే అతని మానసిక పరిస్థితి బాగోలేదని ప్రాథమిక విచారణలో తేలింది. సంఘటన సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి, వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం, నిందితుడి గుర్తింపు వివరాలు తెలియకపోయినా, కేసును ఛేదించడంపై బాధిత మహిళ సంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించారని చెప్పారు. సదరు మహిళ స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఆ వ్యక్తి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని నిర్ధారించుకున్నారు. అతన్ని మానసిక ఆసుపత్రిలో చేర్పించాలని కోరారు. అలాగే నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని బాధితురాలు విజ్ఞప్తి చేశారు. విశాఖలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయనేందుకు ఇది నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసుల పనితీరును ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళలకు రక్షణ విషయంలో దేశంలోనే విశాఖ మొదటి స్థానంలో ఉందని, భవిష్యత్‌లోనూ ఎటువంటి ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఇదే సమయంలో ఇలాంటి ఘటనలపై రాజకీయం చేస్తూ, ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నించేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

**జరిగింది ఇదీ..**

విశాఖపట్నంలో శనివారం ఓ యువతి ఆఫీస్‌కు నడిచి వెళ్తోంది. జగదాంబ సెంటర్‌లో థియేటర్ సమీపంలో ఉన్న రాజాసాబ్ సినిమా పోస్టర్‌ను ఫొటో తీసింది. ఆ సమీపంలో మాలధారణలో ఉన్న వ్యక్తి.. ఆమె వద్దకు వచ్చి గట్టిగా అరవడం ప్రారంభించాడు. తొలుత అతడు సమీపంలోని ఆటో డ్రైవర్లపై అరుస్తున్నాడని భావించింది. ఆ కొద్దిసేపటి తర్వాత.. ఆమె వద్దకు వచ్చి చెంపపై కొట్టి.. నోటికొచ్చినట్లు బూతులు తిట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆమె కళ్ల అద్దాలు పగిలిపోయాయి. ఊహించని ఈ ఘటనతో యువతి భయాందోళనకు గురైంది. అసలు తనను అతడు ఎందుకు కొట్టాడో కూడా తెలియదని ఆవేదన వ్యక్తం చేస్తూ.. జరిగిన ఘటనపై వీడియోలో వివరిస్తూ.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతేకాదు.. ఈ ఘటన జరిగిన సమయంలో ఆ పరిసర ప్రాంతంలో ఉన్న వారెవరూ కనీసం స్పందించలేదంటూ కన్నీటి పర్యంతమవుతూ వివరించింది. ఈ జరిగిన విషయాన్ని తన ఆఫీస్‌లోని సహచరులకు ఫోన్ ద్వారా వివరించింది. దాంతో వారంతా జగదాంబ సెంటర్‌కు వచ్చి సదరు యువతిని తీసుకెళ్లారు. అనంతరం ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జగదాంబ సెంటర్‌కు చేరుకుని.. సమీపంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. యువతిపై దాడి చేసిన వ్యక్తిని కొన్ని గంటల్లోనే అరెస్ట్ చేశారు. ఆ తర్వాత అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే దాడి చేసిన వ్యక్తి మానసిక పరిస్థితి బాగోలేదని పోలీసులు వివరించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు పైవిధంగా స్పందించారు.

# అదే రద్దీ..!



మొదటి పేజీ తరువాయి...

ఆదివారం ఉదయం వరకు సుమారు 70 వేల వాహనాలు ఏపీ వైపు వెళ్లాయని పంతంగి టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు. ఆదివారం కావడతో నేడు రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో టోల్ వద్ద అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేశారు. కానీ వాహనాలు ఒకేసారి వేల సంఖ్యలో వస్తుండటంతో టోల్ ప్లాజాల వద్ద వాహనదారులకు చిక్కులు తప్పడం లేదు. వేగంగా ఫాస్టాగ్ స్కానింగ్ ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఫాస్టాగ్ స్కాన్ వేగంగా జరిగేలా సాంకేతిక ఏర్పాట్లు చేయడంతో పాటు, పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాల వద్ద అత్యవసర సేవల కోసం అంబులెన్స్, క్రేన్, పెట్రోలింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచారు. ఏపీలోని నందిగామ వై-జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. దీనివల్ల ఆ ప్రాంతంలో స్వల్పంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు కొంత ఇబ్బంది పడుతున్నారు. సంక్రాంతి సంబరాల వేళ ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని ఆర్టీసీ బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. పండుగకు మరో రెండు రోజులే సమయం ఉండటంతో, ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ సొంతూళ్లకు చేరుకోవడానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుండి ఖమ్మం మీదుగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే జనం సంఖ్య విపరీతంగా పెరగడంతో ప్రధాన బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ ఖమ్మంతో పాటు ఇతర జిల్లాలకు ప్రత్యేక బస్సులను నడుపుతూ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూస్తోంది. శనివారం నుండి సెలవులు కావడంతో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పండుగకు ముందే సిద్ధమయ్యారు. రెండు రోజులుగా హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా కనిపిస్తుంది. హైదరాబాద్‌లో జాబ్ చేసే వారితో పాటు స్థిరపడిన ఏపీ వారంతా తమ స్వగ్రామాలకు పయనమవుతున్నారు. రైళ్లు, బస్సులతో పాటు సొంత వాహనాల్లో సొంతూళ్లకు వెళ్తున్నారు. వ్యక్తిగత వాహనాల్లో సొంతూళ్లకు ఎక్కువ మంది వెళ్తుండటంతో టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు క్యూకడుతున్నాయి.



## ఉపాధి హామీ పథకాన్ని యథవిధిగా కొనసాగించాలి

### కాంగ్రెస్ ఒకరోజు రిలే దీక్ష

రాజమహేంద్రవరం, జయజయహే:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథవిధిగా కొనసాగించాలని, ఆ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగించడానికి వీల్లేదని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఒకరోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్డీఏ ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చిందని, ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని వారు ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి ఇతర పేర్లు పెట్టడం దారుణమని పేర్కొన్నారు. కేంద్ర వాటాను 90 శాతం కొనసాగించడంతో పాటు కూలీలకు రోజుకు రూ.200 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పథకం పరిరక్షణ కోసం 45 రోజుల ఉద్యమ కార్యాచరణ చేపట్టామని, ప్రజలను ఉద్యమంలో భాగస్వాముల్ని చేస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.





## రూ.52 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజి పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంఖుస్థాపన

రాజమహేంద్రవరం, జయజయహే:

స్థానిక 10వ డివిజన్ (టెంపుల్ వార్డు)లో రూ.54.71 కోట్లతో విస్తృత అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. 10వ డివిజన్ శ్రీ క్షేత్రం శ్రీ మహాగురుస్థాన్ రోడ్డులో రూ.52 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ... డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే రూ.1.79 కోట్లతో పనులు పూర్తయ్యాయని, మరో రూ.1.10 కోట్లు విలువైన పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. హైవే నుంచి గాదాలమ్మ నగర్ వరకు ఇరువైపులా డ్రైనేజి పనులకు రూ.1.66 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ల్యాండ్ అక్విజిషన్, టీడీఆర్ బాండ్స్ ప్రక్రియ పూర్తయ్యాక అదనంగా డ్రైనేజి పనులు చేపడతామన్నారు. ప్రజలతో చర్చించి, కూటమి నాయకుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## మహనీయుల స్ఫూర్తితో ప్రెస్ క్లబ్ ఎన్నికల కోసం వినూత్న నిరసన

రాజమహేంద్రవరం, జయజయహే:



రాజమండ్రి ప్రెస్ క్లబ్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం 'మహనీయులకు నీరాజనాలు' కార్యక్రమం నిర్వహించారు. గణేష్ చౌక్‌లోని ప్రెస్ క్లబ్ నుంచి ప్రదర్శనగా బయల్దేరిన జర్నలిస్టులు నగరంలోని పలు కూడళ్లలో ఉన్న మహనీయుల విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, అబ్దుల్ కలాం, జ్యోతిరావు పూలే, పొట్టి శ్రీరాములు, బాబూ జగజ్జీవన్‌రామ్, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు మెమోరాండాలు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ చేబోలు రాజు, కన్వీనర్ డీ అబ్రహం లింకన్, కో కన్వీనర్ వీ రవికుమార్ మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా ఎన్నికలు జరపకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే ఆమరణ దీక్షలకు సిద్ధమని హెచ్చరించారు. ఈ నెల 18లోగా అధికారులు స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.



## రాష్ట్రానికి అమృత భారత్ రైళ్లు

### ఏపీ మీదుగా 3 రైళ్ల రాకపోకలు

### తమిళనాడు నుంచి బెంగాల్‌కు

### ప్రారంభించనున్న ప్రధాని మోడీ

జయజయహే

ప్రజలకు రైల్వేశాఖ భారీ గుడ్‌న్యూస్ అందించింది. సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులకు భారీ గిఫ్ట్ ప్రకటించింది. కొత్తగా మరో మూడు రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానుంది. త్వరలోనే తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో కేంద్రం ప్రభుత్వం ఆ రాష్ట్రానికి ఉపయోగపడేలా పలు నిర్ణయాలు తీసుకుంటోంది.అందులో భాగంగా తమిళనాడు నుంచి కొత్తగా మూడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కేటాయించింది. ఈ మూడు రైళ్లు తమిళనాడు నుంచి బయల్దేరి ఏపీ మీదుగా పశ్చిమబెంగాల్ వరకు వెళతాయి. దీంతో ఏపీలోని ప్రజలకు లాభం జరగనుంది. ఈ మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల షెడ్యూల్స్‌తో పాటు ఏయే ప్రాంతాల మీదుగా వెళతాయనేదానిపై స్పష్టతను ఇచ్చారు. తిరుచిరాపల్లి నుంచి పశ్చిమబెంగాల్‌లోని న్యూ జల పాయ్ వరకు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను నడపనున్నారు. ఈ రైలు చిదంబరం, తాంబరం, చెన్నై ఎగ్మోర్, చెంగల్పట్లు, విల్లుపురం, కడలూరు, మైలాడుథురై, కుంభకోణం, తంజావూరు, విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్, ఖరగ్‌పూర్ స్టేషన్ల మీదుగా ప్రయాణించనుంది. ఇక రెండో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ తాంబరం-సంత్రాగచ్చి మధ్య సర్వీసులు అందించనుంది. ఈ రైలు చెన్నై ఎగ్మోర్, విజయవాడ, ఖరగ్‌పూర్, భువనేశ్వర్ స్టేషన్లలో ఆగుతుంది. ఇక వీటిల్లో మూడో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నాఅబశ్రీశ్రీగకోయిల్-న్యూ జలపాయ్ మధ్య నడుస్తోంది. ఈ రైలు దిండిగల్, మధురై, విరుధ్ నగర్, పళని, ఉడుమాల్ పేట, పొల్చాచ్చి, కోయంబత్తూర, తిరుప్పూర్, సేలం, ఈరోడ్ మీదుగా ప్రయాణించి విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్, ఖరగ్ పూర్ మీదుగా ప్రయాణం సాగిస్తోంది. ఈ మూడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను త్వరలో ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. దీని వల్ల తమిళనాడు, ఏపీ, పశ్చిమబెంగాల్ ప్రజలకు లాభం జరగనుంది. ఇప్పటికే సామాన్యుల కోసం దేశవ్యాప్తంగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.



## ఘనంగా స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం, జయజయహే:

జిల్లా ఎస్పీ శ్రీ డి. నరసింహ కిషోర్ ఐ.పీ.ఎస్. ఆదేశాల మేరకు స్వాతంత్ర సమరయోధుడు శ్రీ వడ్డే ఓబన్న గారి జయంతి వేడుకలను తూర్పుగోదావరి జిల్లా పోలీసు శాఖ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం దేశభక్తి భావాలను మరింత బలపరచే విధంగా జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్. చెంచి రెడ్డి , డీఎస్పీ (ఎస్‌బీ) బి. రామకృష్ణ , ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ ( ఎ.ఆర్). చెంచు రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సాధనలో వడ్డే ఓబన్న త్యాగాలు, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఆయన చూపిన దేశభక్తి మార్గం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో దేశ ప్రేమను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.



## బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

రాజమహేంద్రవరం, జయజయహే:

భారతీయ జనతా పార్టీ శ్రీ పివిఎన్ మాధవ గారి ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషీధ రాజు సారథ్యంలో తూర్పుగోదావరి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పాలడుగుల శ్రీవిద్య ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 12 మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రాజమహేంద్రవరం క్వారీ సెంటర్ లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరగనుందని తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు సంప్రదాయ సంస్కృతి, మహిళా సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా నిర్వహించబడతాయని తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పాలడుగుల శ్రీవిద్య మహిళలందరికీ హృదయపూర్వక స్వాగతం, సుస్వాగతం తెలిపారు.

# మయన్మార్‌లో ఉద్యోగాల పేరిట దగా



మొదటి పేజీ తరువాయి...

బాధితుల కథ అందరినీ కలచివేసింది. మంచి ఉద్యోగం, అధిక జీతం అంటూ మధ్యవర్తుల మాటలు నమ్మి మయున్మార్ వెళ్లిన 27 మంది యువకులు అక్కడికి చేరుకున్నాక వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని గుర్తించారు. యువకులను బలవంతంగా సైబర్ మోసాల కార్యకలాపాల్లోకి నెట్టడం, శారీరక వేధింపులకు గురిచేయడం, స్వేచ్ఛ లేకుండా నిర్బంధంలో ఉంచడం వంటి అమానుష ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో తమ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని గ్రహించిన బాధితులు వీడియోల ద్వారా తమ గోడును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువచ్చారు. బాధితుల పరిస్థితి తెలుసుకున్న వెంటనే కేంద్ర మంత్రి స్పందించి వారిని వెంటనే రక్షించాల్సిన అవసరం ఉందని భావించారు. ఈ విషయమై విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ జై శంకర్‌కు లేఖ రాసి, మయున్మార్‌లో చిక్కుకున్న భారతీయులను తిరిగి తీసుకురావాలని కోరారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, యాంగాన్‌లోని భారత రాయబారి కార్యాలయం సమన్వయంతో వేగంగా చర్యలు చేపట్టి బాధితులను న్యూఢిల్లీకి సురక్షితంగా తీసుకువచ్చారు.

**అండగా నిలుస్తాం: రామ్మోహన్ నాయుడు**

స్వదేశ గడ్డపై అడుగుపెట్టిన వెంటనే బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విదేశాంగ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధికారులు బాధితులను వారి స్వస్థలాలకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ప్రతి భారతీయుడి భద్రత, గౌరవం కాపాడటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, దేశం వెలుపల ఎక్కడైనా భారతీయులు ఇబ్బందుల్లో ఉంటే వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనతో అయినా మానవ అక్రమ రవాణా ప్రమాదాల పై యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, యువత మోసపు మాటలు నమ్మి జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని సూచించారు.



## వైసీపీ సీనియర్ నేతలతో రవిరాజు వరుస సమావేశాలు

### నియోజక వర్గాల్లో జరిగే ప్రచార కార్యక్రమాలకు తోడ్పాటు హామీ

**విశాఖపట్నం, జనవరి 11, జయ జయహే**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జోన్ 1 ప్రచార కమిటీ అధ్యక్షులు జీవీ రవి రాజు ఆ పార్టీలోని కీలకమైన సీనియర్ నేతలతో వరుస సమావేశాలు అవుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని విజయ తీరాలకు ఎలా తీసుకెళ్లాలనే దానిపై ముఖ్య నేతలతో చర్చలు జరుపుతున్నారు. అలాగే పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో అనే దానిపై అంతర్గతంగా సమాలోచనలు చేస్తున్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపేందుకు అవసరమైన బాధ్యతలను సమర్ధవంతవంతంగా నిర్వహించనున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానంతో ఆయన సీఎంగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు అవసరమైన వ్యూహ రచన సాగిస్తున్నారు. అందులో భాగంగానే గత రెండు రోజులుగా నగరంలోని వైసీపీ ముఖ్య నేతలందరితో సమావేశాలు...సంప్రదింపులు చేపడుతున్నారు. రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, విజయనగరం జెడ్పీ ఛైర్మన్, భీమిలి నియోజక వర్గ వైసీపీ ఇన్‌ఛార్జి మజ్జి చిన్న శ్రీను, మాజీ మంత్రి, చోడవరం నియోజక వర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజక వర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి తదితరులందరితో జీవీ రవిరాజు వరుస సమావేశాలయ్యారు. ఆయా నియోజక వర్గాల్లో చేపట్టే ప్రచార కార్యక్రమాలకు తమ వంతు సంపూర్ణ సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. ఆయా నేతలను కలసిన వారిలో రవిరాజుతో పాటు వైసీపీ నాయకులు దల్లి రామకృష్ణా రెడ్డి, బొడ్డేటి గంగా మహేష్, కె. కుమార్, సర్దార్, డొక్కా ప్రసాద్, బాణాల సాయి, వి. శివ కుమార్ రెడ్డి, బోరా కుమార్ రెడ్డి, విమల్, డి. వర ప్రసాద్ బి. కుమార్ రెడ్డి, ఎస్. గణేష్, బి. సాయి, కొండలరావు తదితరులున్నారు.



# నేటి అశాంత ప్రపంచానికి స్వామి వివేకానందుని సందేశం

## ఒక సమకాలీన దృష్టికోణం

**ప్రొఫెసర్. విశ్వేశ్వర రావు చెనమల్లు**



**స్వామి వివేకానంద శతాబ్దం క్రితం మానవాళి శ్రేయస్సు కోసం అందించిన సందేశాన్ని వారి జన్మదిన సందర్బంగా నేడు ఆ సందేశాన్ని స్మరించడం బహు సందర్భోచితం. ప్రస్తుత ప్రపంచం రాజకీయ ఉద్రిక్తతలు, సామాజిక అశాంతి, దేశాల మధ్య పెరుగుతున్న అనమ్మకంతో కలత చెందుతోంది. శక్తివంతమైన దేశాలు తమ రాజకీయ, ఆర్థిక, సైనిక ప్రభావాన్ని ఉపయోగించి ఇతర దేశాలపై ఆధిపత్యం సాధించాలనే ప్రయత్నాలు చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, ఇరాన్ వంటి దేశాలలో ప్రజలు తమ హక్కులు, గౌరవం, న్యాయం కోసం వీధుల్లోకి రావడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితులన్నిటి మధ్య స్వామి వివేకానందుని శతాబ్దాల నాటి సందేశం నేటి సమాజానికి మరింత అవసరానుసారంగా మారింది.**

1893లో అమెరికాలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంట్లో స్వామి వివేకానందుడు ప్రస్తావించిన "సోదరభావం" అనే భావన కేవలం మతపరమైన లేదా ఆధ్యాత్మిక ఉపదేశంగా మాత్రమే పరిమితం కాలేదు. అది మానవాళి మొత్తానికి వర్తించే విశాలమైన మానవీయ సిద్ధాంతంగా నిలిచింది. ప్రపంచంలోని దేశాలు పరస్పరంగా ఆధిపత్య భావనతో వ్యవహరించినప్పుడు ఘర్షణలు, యుద్ధాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఒక దేశం మరొక దేశాన్ని బలవంతంగా నియంత్రించడం ద్వారా శాశ్వత శాంతి సాధ్యం కాదని ఆయన స్పష్టంగా వివరించారు. పరస్పర గౌరవం, సంభాషణ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం, సహకారంతో అభివృద్ధి సాధించడం ద్వారానే ప్రపంచంలో నిజమైన శాంతి, స్థిరత్వం ఏర్పడుతాయని స్వామి వివేకానందుడు దృఢంగా విశ్వసించారు.

నేటి కాలంలో కొన్ని శక్తివంతమైన దేశాల విధానాలు, చర్యలు ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని ప్రశ్నించేలా ఉన్నాయనే భావన అంతర్జాతీయ వేదికలపై వ్యక్తమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో స్వామి వివేకానందుని సందేశం నాయకులకు ఒక నైతిక మార్గదర్శకంగా నిలుస్తుంది. నిజమైన శక్తి అనేది బలవంతంలో కాదు, బాధ్యతాయుతమైన నాయకత్వంలో ఉందని ఆయన బోధించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కన్నా, సమస్యలను బహుళ పక్షాల చర్చల ద్వారా పరిష్కరించుకోవడమే మానవత్వానికి అనుకూలమని ఆయన ఆలోచన సూచిస్తుంది.

ఇక ప్రజా ఉద్యమాల విషయానికి వస్తే, స్వామి వివేకానందుడు యువతలో ఆత్మవిశ్వాసం, స్వీయ గౌరవం, మరియు సామాజిక బాధ్యతను నింపాలని కోరుకున్నారు. బంగ్లాదేశ్, ఇరాన్ వంటి దేశాల్లో ప్రజలు వ్యక్తం చేస్తున్న అసంతృప్తి వారి జీవన పరిస్థితులు, హక్కుల పట్ల ఉన్న ఆవేదనకు ప్రతిబింబం. అయితే ఆయన బోధన ప్రకారం, మార్పు హింస ద్వారా కాకుండా నైతిక బలం, ఐక్యత, శాంతియుత మార్గాల ద్వారానే రావాలి.

ప్రపంచ సమాజం మొత్తం స్వామి వివేకానందుని దృక్పథన్ని అవలంబిస్తే, శక్తి ఆధారిత రాజకీయాల నుంచి మానవ కేంద్రిత ప్రపంచవ్యవస్థ వైపు అడుగులు పడతాయి. ప్రతి దేశం తన ప్రయోజనాలతో పాటు మానవాళి సంక్షేమాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటేనే ప్రపంచంలో స్థిరత్వం ఏర్పడుతుంది.

అశాంతితో నిండిన నేటి ప్రపంచానికి స్వామి వివేకానందుని సందేశం ఒక దీపస్తంభంలాంటిది. న్యాయం, కరుణ, సోదరభావం అనే విలువలను ఆచరణలో పెట్టగలిగితే, సంఘర్షణల స్థానంలో సంభాషణ, అశాంతి స్థానంలో శాంతి నెలకొంటుంది. అదే ఆయన ప్రపంచానికి ఇచ్చిన శాశ్వత సందేశం.

"సోదరభావమే ప్రపంచ శాంతికి పునాది," "ఇతరులను గౌరవించడమే నిజమైన బలం; అదే గౌరవాన్ని తిరిగి తెస్తుంది" వంటి స్వామి వారు చెప్పే బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరం. స్వామి వివేకానంద చూపిన మార్గంలో నడవడం అంటే, ఆయనను గౌరవించడమే కాదు, మనలను మనం గౌరవించుకోవడం, మనలను మనం కాపాడుకోవడం. తద్వారా మానవాళిని కాపాడుకోవడం.

**ప్రొఫెసర్. విశ్వేశ్వర రావు చెనమల్లు**



# భారత్ వెండి దిగుమతుల విధానంలో సమూల మార్పు అవసరం

**(సి.హెచ్.ప్రతాప్)**

**ఆధునిక పారిశ్రామిక యుగంలో వెండి కేవలం ఆభరణాల తయారీలో ఉపయోగించే లోహంగా పరిమితమైంది కాదు. ఇంధన మార్పిడులు, ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, సోలార్ సాంకేతికత---ఈ అన్నింటికీ వెండి కీలక ముడిసరుకుగా మారింది. ఇటువంటి నేపథ్యంలో, గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తాజాగా విడుదల చేసిన గణాంకాలు భారత్ వెండి దిగుమతుల విధానంలో తక్షణం, సమగ్ర సంస్కరణలు అవసరమని స్పష్టంగా సూచిస్తున్నాయి. శుద్ధి చేసిన వెండిని నేరుగా దిగుమతి చేసుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని విపరీతంగా వెచ్చిస్తున్న ప్రస్తుత విధానం ఆర్థికంగా దీర్ఘకాలికంగా స్థిరమైనది కాదు.**




ఇక్కడ చైనా అనుసరిస్తున్న వ్యూహాత్మక దృక్పథం మనకు మార్గదర్శకంగా నిలుస్తుంది. శుద్ధి చేసిన వెండిని కాకుండా, వెండి ఖనిజాన్ని దిగుమతి చేసుకుని దేశీయంగా శుద్ధి ప్రక్రియలను అభివృద్ధి చేయడం ద్వారా చైనా విలువ జోడింపులో ముందంజలో ఉంది. 2024లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన వెండి ఖనిజ దిగుమతుల్లో గణనీయమైన వాటా చైనా చేతుల్లోనే ఉండటం వారి దూరదృష్టికి నిదర్శనం. ఈ విధానం కేవలం ముడిసరుకు సరఫరాను భద్రపరచడమే కాకుండా, దేశీయ పరిశ్రమలకు బలాన్నిస్తుంది.

వెండి ఖనిజ దిగుమతులు పెరిగితే, దేశంలో శుద్ధి పరిశ్రమలు విస్తరిస్తాయి; ఉపాధి అవకాశాలు పెరుగుతాయి; తక్కువ ధరకు లభించే ఖనిజాన్ని విలువైన లోహంగా మార్చడం ద్వారా భారీగా విలువ జోడింపు సాధ్యమవుతుంది. చైనా ఈ శుద్ధి చేసిన వెండిని సోలార్ ప్యానెళ్లు, వైద్య పరికరాలు, అత్యాధునిక ఎలక్ట్రానిక్స్‌లో సమర్థంగా వినియోగిస్తూ గ్లోబల్ మార్కెట్లను ప్రభావితం చేస్తోంది. సోలార్ రంగాన్ని భారత్ వేగంగా విస్తరిస్తున్న ఈ సమయంలో, వెండి వినియోగం తప్పనిసరిగా పెరుగుతుంది. అటువంటి పరిస్థితుల్లో శుద్ధి చేసిన వెండిపై దిగుమతుల ఆధారాన్ని కొనసాగించడం ఆర్థిక భారం అవుతుంది.

కావున, దిగుమతి విధాన మార్పుతో పాటు పలు వ్యూహాత్మక చర్యలు కూడా అవసరం. విదేశాల్లో వెండి నిక్షేపాలు ఉన్న గనులను లీజుకు తీసుకోవడం లేదా వాటాలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ముడిసరుకు సరఫరాను దీర్ఘకాలికంగా భద్రపరచాలి. దేశంలో చలామణిలో ఉన్న పాత వెండి వస్తువుల శాస్త్రీయ రీసైక్లింగ్ సామర్థ్యాన్ని పెంచాలి. పట్టణాల్లో లభించే ఈ-వేస్ట్ నుంచి వెండిని వెలికితీసే 'అర్బన్ మైనింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా కొత్త దిగుమతులపై ఆధారాన్ని తగ్గించవచ్చు. అంతేకాక, తయారీదారులకు ప్రోత్సాహకాలు, ఖనిజ దిగుమతులకు అనుకూలమైన సుంక విధానం వంటి చర్యలు తక్షణం అమల్లోకి రావాలి.




## మంత్రి నారా లోకేష్ దిశా నిర్దేశం

### తూర్పుగోదావరిలో టీడీపీ బలోపేతంపై కాశి నవీన్‌తో చర్చ

**రాజమహేంద్రవరం, జయజయహే:** తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ మరియు మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరిగింది. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఇన్‌చార్జి మంత్రులతో కలిసి పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాల్లో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి కార్యకర్తల మధ్య ఐక్యత పెంపొందించాలని, అంతర్గత విభేదాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం సాధించిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి విజయాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని అన్నారు. స్పందించిన కాశి నవీన్ కుమార్, మంత్రి సూచనలను అమలు చేస్తూ జిల్లాలో టీడీపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

# ఏ వెంకంపేటలో ఉత్తరాంధ్ర జిల్లాల వాలీబాల్ పోటీలు



### పోటీల్లో పాల్గొన్న 52 జట్లు క్రీడాకారులు

### మంత్రి గుమ్మడి సంధ్యారాణి తండ్రి జ్ఞాపకార్థంగా

### మొదట బహుమతి విజేతగా వీరఘట్ట టీం

### ఎడ్ల పందాలకు హాజరుకానన్న రాజకీయ ప్రముఖులు

**మక్కువ, (జయజయహే):-**

పార్వతీపురం మన్యం జిల్లా , మక్కువ మండలం ఎ వెంకంపేట గ్రామంలో ఉత్తరాంధ్ర జిల్లాల వాలీబాల్ పోటీలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తండ్రి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జన్ని ముత్యాలు జ్ఞాపకార్థంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలనాయుడు తమ స్వగ్రామమైన ఏ వెంకంపేట లో ఆటల పోటీలు నిర్వహించడం విశేషం.! గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని తమ అభిమాన నాయకురాలుపై గల తమ అభిమానాన్ని చాటుకుంటూ , ఉత్తరాంధ్ర జిల్లాల ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. గత మూడు రోజులుగా నిర్వహించిన ఆటల పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుండి సుమారు 52 జట్లు క్రీడాకారులు పాల్గొని పోటా పోటీగా పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల క్రీడలను మక్కువ తహసిల్దార్ కే భరత్ కుమార్, సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ , మక్కువ ఎస్ఐ , ఎం వెంకటరమణ క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను మరింత ఉత్తేజ పరచడంతో క్రీడాకారుల్లో మరింత ఉత్తేజం నింపింది. క్రీడాకారులకు కావలసిన భోజన వసతి సౌకర్యాలు మండల పార్టీ అధ్యక్షులు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో వీర ఘట్టానికి చెందిన క్రీడాకారులు మొదటి బహుమతి గెలుపొందగా, రెండవ బహుమతి మక్కువ మండలం ఊటగడ్డ గ్రామానికి చెందిన క్రీడాకారులు కైవశం చేసుకున్నారు. మూడవ బహుమతి బొబ్బిలి మండలం గున్న తోటవలస గ్రామానికి చెందిన క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. విజేతలైన క్రీడాకారులకు ముందు ప్రకటించిన విధంగా నగదు పురస్కారంతోపాటు జ్ఞాపికలు నేడు అనగా సోమవారం నాడు మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా అందజేయనున్నట్టు మండల పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలనాయుడు తెలిపారు. అలాగే 13వ తేదీన నిర్వహించిన ఎడ్ల పందాలకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి తో పాటు రాజకీయ ప్రముఖులు ఉన్నట్టు ఆయన సందర్భంగా తెలిపారు.





# డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఉపాధ్యాయ రత్న జాతీయ స్థాయి అవార్డు

**అరకులోయ: జయ జయహే.**

మండలంలోని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు కు సావిత్రిబాయి పూలే మెమోరియల్ ఆర్గనైజేషన్ ద్వారా ఉపాధ్యాయ రత్న జాతీయ అవార్డు ను విశాఖపట్నం ప్రెస్ క్లబ్ లో ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ కె కృష్ణమూర్తి అందజేశారు. అవార్డు తో పాటుగా సన్మాన పత్రం ప్రదానం చేశారు. మహిళా విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కళాశాలను అభివృద్ధి పథంలో కొనసాగించడం ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్య అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీత పట్టాసి చలపతి రావు మాట్లాడుతూ. అందరి సహకారంతో మన కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. పలువురు ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డు కార్యక్రమంలో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కన్న తల్లి తండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కుటుంబ పెద్దలు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

# అనంతగిరిలో మెగా క్రికెట్ టోర్నమెంట్

**అనంతగిరి: జయ జయహే.**



అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదబిడ్డ పంచాయతీ పరిధిలో ని మెగా క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఈనెల 19 తేదీన ప్రారంభించబడును. సంక్రాంతి స్పెషల్ మెగా క్రికెట్ టోర్నమెంట్.. ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షులు. చట్టు మోహన్ ఆదేశాల మేరకు. ఆదివాసీ పరిరక్షణ సమితి అనంతగిరి మండల అధ్యక్షులు. సోమేల స్వామి ఆధ్వర్యంలో సంక్రాంతి శుభ సందర్భంగా మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబడును.. అనంతగిరి మండలం, పెదబిడ్డ గ్రామపంచాయతీ పరిధిలో సంక్రాంతి స్పెషల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబడును. కావున అనంతగిరి మండలంలో ఉన్న 24 గ్రామ పంచాయతీకి చెందిన గ్రామాల క్రికెట్ జట్లు ఈ యొక్క క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని తమ ప్రతిభను కనబరచి విజయవంతము చేయగలరని ఇందుమూలముగా సోమేల స్వామి పిలుపునిచ్చారు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:

సోమేల స్వామి
ఫోన్: 93472 83005
సోమేల కృష్ణ ప్రసాద్
ఫోన్: 6300184836
సోమేల సురేష్ గోపి
ఫోన్: 9391055257.



# కేజీ బేసిన్ పేరుతో కోనసీమ విధ్వంసం

### మేడా శ్రీనివాస్ డిమాండ్

**రాజమహేంద్రవరం, జయజయహే:**

పచ్చని కోనసీమను కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు కేజీ బేసిన్ త్రవ్వకాల పేరుతో సర్వనాశనం చేస్తున్నాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. రాజమహేంద్రవరం అర్పిసి ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడారు. పాశర్లపూడి, ఇరుసుమండ ప్రాంతాల్లో జరిగిన బ్లోఔట్ ఘటనలు ప్రజల్లో భయాందోళనలకు కారణమయ్యాయని, గాలి--నీరు కలుషితమై అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు కేజీ బేసిన్ సంపదలో ఆంధ్రప్రదేశ్‌కు 50 శాతం వాటాను తక్షణమే అమలు చేయాలని, ఓఎన్‌జీసీ కేంద్ర కార్యాలయాన్ని చెన్నై నుంచి రాజమండ్రికి తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే ఓఎన్‌జీసీ ఉద్యోగాల్లో ఆంధ్రప్రదేశ్ యువతకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.200కే సరఫరా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఈ సమావేశంలో అర్పిసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిన్నప్పన్నపాలెంలో త్రాగునీటి సమస్య పరిష్కారం

### ఇంటింటి కుళాయిలు ఏర్పాటు .. హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**బుచ్చియ్యపేట జయ జయహే**

మండలంలోని చిన్నప్పన్నపాలెంలో త్రాగునీటి సమస్య పరిష్కారమైంది. ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి రెండు పూటలా సురక్షితమైన త్రాగునీరు అందిస్తున్నామని సర్పంచ్ కోవెల నాగమణి, వైసిపి నేత కోవెల ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం వారు త్రాగునీటి కుళాయిలను ప్రారంభించారు. తొలి విడత జల్జీవన్ మిషన్లో రూ.68 లక్షలు, రెండో విడత రూ.28 లక్షలతో గ్రామంలో ఇంటింటి కులాయిలు నిర్మాణానికి పైప్ లైన్లు ఏర్పాటు చేశారన్నారు. గ్రామపంచాయతీ నిధులతో మరో 15 త్రాగునీటి కుళాయిలను నిర్మించామన్నారు. గ్రామంలో త్రాగునీటి సమస్యను పరిష్కారం కావడంతో సర్పంచ్ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజముద్ర పాసు పుస్తకాలకే పరిమితం

### గత ప్రభుత్వంలో ఇచ్చిన పాస్ బుక్ తీసుకొనిరవాలని

### లేకుంటే రాజాముద్రతో వచ్చిన పాస్ పుస్తకం ఇవ్వము అంటూ

### అధికారులు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు

### రైతులకు లబ్ధి శూన్యం

### సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు

**బుచ్చయ్య పేట జయ జయహే**

రైతుల భూమి హక్కులకు ఆధారమైన పాసు పుస్తకాలలో రూపం మారినప్పటికీ, అసలు సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని రైతులు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కరక,తురకలపూడి రెవెన్యూ ఈ సమస్యలు అధికంగా కనబడంతో ప్రజలు వాపోతున్నారు. సర్వే నెంబర్, భూమి విస్తీర్ణం, రైతు పేరు, ఆధార్ నెంబర్ , ఫోన్ నెంబర్, రైతులు రెవెన్యూ గ్రామం, రైతు ఫోటో వంటి కీలక లోపాలు రైతులు కొనసాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రైతు పాస్ పుస్తకాలపై వైఎస్ జగన్ ఫోటో ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాస్ పుస్తకాలలో ఉన్న తప్పులను సవరించి రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు ముద్రిస్తామని హామీ ఇచ్చిందని ఆకుల నాగేశ్వరరావు గుర్తు చేశారు. అయితే ఆ హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని ఆయన ఆరోపించారు. పాస్ పుస్తకాలలో తప్పుల కారణంగా రైతులు బ్యాంకుల వద్ద రుణాలు పొందడంలో, పంట రుణ మాఫీ, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొందరు




రైతుల భూమి వివరాలు ఇతరుల పేర్లతో నమోదవడం, విస్తీర్ణంలో తేడాలు ఉండడం వల్ల అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ లోపాలను సరిచేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నప్పటికీ, రైతులు మాత్రం పూర్తిస్థాయిలో డేటా శుద్ధి చేసి తప్పులేని పాసు పుస్తకాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. పాస్ పుస్తకాల రూపం మార్చడమే కాకుండా, భూమి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారానే రైతులకు న్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, స్పష్టమైన కార్యాచరణ రూపొందించి పాసు పుస్తకాల లోపాలను సవరించాలని పలువురు రైతు నాయకులు కోరుతున్నారు.

# కోడి పందేలు, పేకాట నిర్వహణపై అధికారుల డెడ్‌లైన్

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేదు

### జీకేవీధి ఎస్ఐ సురేష్ హెచ్చరిక

**గూడెంకొత్తవీధి: జయ జయహే.**



మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టనున్నారు. కోడి పందేలు, పేకాట వంటి అక్రమ జూద కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించరాదని జీకే వీధి సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ స్పష్టంగా హెచ్చరించారు. పండుగలు, వేడుకల సందర్భంలో కొంతమంది అక్రమంగా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు చట్టవిరుద్ధమని, వీటిని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ,"మండల పరిధిలో కోడి పందేలు, పేకాట, ఇతర జూద కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. చట్టాన్ని ధిక్కరించి ఆదేశాలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి, అవసరమైతే అరెస్టులు కూడా చేస్తాం. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేస్తాం" అని హెచ్చరించారు. గ్రామాల స్థాయిలో కూడా పోలీస్ బృందాలు గస్తీ పెంచనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎవరైనా అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడటం, యువతను చెడు అలవాట్ల నుంచి దూరం పెట్టడమే తమ ప్రధాన లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు. చట్టాన్ని గౌరవించి, సహకరించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

For a pure tomorrow.. జయహే

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

### 33 సంవత్సరాల తర్వాత కలుసుకున్న సెయింట్ పీటర్స్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు

పెందుర్తి (జయ జయహే)



33 సంవత్సరాల తర్వాత 50 ఏళ్ల వయసులో పూర్వ విద్యార్థులు అపూర్వకలయకతో కలిసి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పెందుర్తి మండలం ఎస్ఆర్ పురం లో ఓ ప్రైవేట్ రిసార్ట్లో స్నేహితులందరికీ తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ పీటర్స్ హై స్కూల్ లో 1992-93 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పదో తరగతి ఏ,బి,సి మూడు సెక్షన్లోని 160 మంది విద్యార్థులకు గాను 116 మంది హాజరై తమ స్నేహాన్ని చాటుకున్నారు. హైదరాబాద్ బెంగళూరు, స్విట్జర్లాండ్, అమెరికా, కెనడా వంటి దేశ విదేశాల నుంచి విద్యార్థులు హాజరై ఆనందాన్ని పంచుకున్నారు.ముందుగా పాఠశాల అప్పటి ప్రధానోపాధ్యాయులు మాథ్యూ ఆల్ఫాట్, వ్యాయామ ఉపాధ్యాయులు దాస్ మాస్టర్ తో పాటు స్వర్గస్తులైనా పలువురు ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటించారు. అదేవిధంగా 1990 లలో అప్పుడు పాఠశాలకు వెళ్లే ముందు, విరామ సమయం లో తినే చిరుతిళ్ళు ప్రదర్శించారు. స్ట్రాంగ్ బిళ్ళలు, మేరీ బిస్కెట్లు, తాటి తాండ్ర, మామిడి తాండ్ర, చెరకు ముక్కలు పొంగడాలు, తేనె ఉండలు, ఊరబెట్టిన ఉసిరికాయలు, మామిడి ముక్కలు, జీళ్ళు, కొబ్బరి ఉండలు, వంటివి ప్రదర్శనగా వుంచి పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే సెయింట్ పీటర్స్ పాఠశాలను ఎన్నటికీ మేమంతా మరువలేమని పూర్వ విద్యార్థులందరూ భావోద్వేగంతో అన్నారు ఇకనుంచి ప్రతి ఏడాది సెయింట్ పీటర్స్ హై స్కూల్ కుటుంబంలో కలుసుకోవాలని అందరూ తీర్మానించుకున్నారు అందరి కష్టసుఖాల్లోనే అందరం కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. ప్రధానంగా ఈ కార్యక్రమం ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించినటువంటి కొర్లాపు కమల్ కుమార్,ఆళ్ల పాండురంగదేవ్, గొర్లె సతీష్, కాళ్ళ విజయ్ కుమార్, గంద్రేడ్డి అనిల్,అప్పల రెడ్డి, మట్టా చిరంజీవి,వాదాడ గణపతి, బి. రవికాంత్ లను పూర్వ విద్యార్థులంతా అభినందించారు.



# కాలనీలు సందర్శించిన ఎమ్మెల్యే

### సంక్రాంతి అనంతరం సమస్యలు పరిష్కారం

చోడవరం జనవరి 11 జయ జయహే

గత ప్రభుత్వంలో చీడికాడ రోడ్డులో నిర్మించిన కాలనీలను చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కాలనీవాసుల అభ్యర్థన మేరకు ఆదివారం పరిశీలించారు. కాలనీలో ఎలాంటి మౌలిక వసతులు లేవని కాలనీవాసులందరూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువలు, రోడ్లు, మంచినీటి సదుపాయము, స్మశాన వాటిక వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకు సంక్రాంతి పండుగ వెళ్లిన వెంటనే అధికారులు తీసుకుని వచ్చి ఏర్పాటు చేస్తానన్నారు. అలాగే కాలనీ మీదుగా వెళ్లే హెచ్టి లైన్లను అధికారులతో మాట్లాడి క్రమబద్ధీకరిస్తానని చెప్పారు. అనంతరం కాలనీవాసులందరూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.ఈ కాలనీ లో అన్ని వీధిలో తిరిగి సమగ్ర ప్రణాళిక తయారు చేయిస్తానని అనంతరం సమస్యలను పరిష్కరిస్తానని గుర్తు చేశారు. ఈ కాలనీకి ఏ పేరు పెట్టారు అనే ప్రజలను అడగగా ఎలాంటి నామకరణం లేదని తెలుపగా మీరందరూ కాలనీకి మంచి పేరు సూచించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు చిన్న, హాస్పటల్ కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, ఎంపీటీసీ రూపా దేవి చిన్న, వంగలి దివ్య శేషు, నౌడు సుధాకర్, అనకాపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎలకా మల్లిబాబు, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ పార్వతి దేముడు, స్థానిక నాయకులు అయ్యప్ప, అధిక సంఖ్యలో మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.




# సాకేత్ జయంతి సందర్భంగా క్రీడ పోటీలు

చోడవరం జనవరి 11

చోడవరం ప్రేమ సమాజం లో సాకేత్ ఫౌండేషన్, క్రీడా భారతి ఆధ్వర్యం లో సాకేత్ జయంతి కార్యక్రమంలో భాగంగా కనడ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఆర్క్ ప్రసాద్ అధ్యక్షత వహించగా చోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పల రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనేక మంది క్రీడాకారులు,సామాజిక సంస్థ ల అధిపతులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు కబాడి ఆట లోపాల్గొన్నారు..జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న సీనియర్ ఆథల్ట్స్ పివిఎం నాగజ్యోతి పాల్గొని నేటి క్రీడాల్లో ఎంతో స్ఫూర్తి నింపారు..ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పల రాజు మాట్లాడుతూ ఉత్తమ క్రీడాకారులకు వుండవలసిన క్రమ శిక్షణ,అంకిత భావం,ఇగో ను తొలగించుకోవడం లాంటి విషయాలు తెలిపారు.అలాగే మద్యానికి,డ్రగ్స్ కు దూరంగా వుండాలనీ,సూర్యోదయం కి ముందే నిద్ర లేవడం లాంటి టిప్స్ తెలిపారు. ఈ సందర్భంగా సాకేత్ తల్లి తండ్రులను అభినందించి సన్మానించారు. ఈనెల 9,10 తేదీల్లో వివిధ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కబాడి పోటీల్లో గెలుపొందిన విజేతలకు సిఐ అప్పలరాజు ప్రేమ సమాజం కార్యదర్శి ప్రసాద్ రాజు, మోహన్ వెటరన్ క్రీడాకారుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ సంస్థ ప్రతినిధులు ప్రకాష్,గణేష్,నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



### చిన్నలబుడులో శానిటేషన్

# పారిశుద్యం కార్యక్రమం

అరకులోయ: జయ జయహే.

మండలంలోని చిన్నలబుడు పంచాయతీ మాలి సింగారం గ్రామంలో శానిటేషన్ పరిశుద్యం కార్యక్రమం నిర్వహించారు.అంటే వ్యాధులను నివారించడానికి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటానికి మానవ వ్యర్థాలుమురుగు నీరు ఘన వ్యర్థాల సరైన నిర్వహణ పరిశుభ్రమైన నీటి సరఫరా శుభ్రతను పాటించే పద్ధతులు ఇది పరిశుభ్రమైన పర్యావరణాన్ని సురక్షితమైన మాలమూత్ర విసర్జన సౌకర్యాలను కల్పించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది అని. స్థానిక పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో శానిటేషన్ పరిశుభ్రత చర్యలు చేపట్టడం జరుగుతుందని. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బురిడీ ఉపేంద్ర ఆధ్వర్యంలో పంచాయతీ అధ్యక్షుడు పాంగి భగత్ రామ్. ఉపాధ్యక్షుడు గేమెలి అర్జున్. ఈ శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి నాయకులు వార్డు మెంబర్ నాగేష్ . పెసా కమిటీ మధు. పెసా కమిటీ బుజ్జి (దాసు. మాజీ సర్పంచ్ పూర్ణ . గరం గిరిబాబు. క్లప్ మిత్ర సిబ్బంది పాల్గొన్నారు



# నాగజ్యోతికి ఉపాధ్యాయ రత్న-2026 అవార్డు ప్రదానం

చోడవరం జనవరి 11, జయ జయహే

తన ప్రతిభ పాటవాళ్ళతో వరుస విజయాలు సాధిస్తున్న ఉపాధ్యాయురాలు నాగజ్యోతి మరో అరుదైన అవార్డును పొందింది.విద్యా రంగంలో 27 సంవత్సరాలకు పైగా అంకితభావంతో సేవలందిస్తున్న రోలుగుంట

జిల్లా పరిషత్ హై స్కూల్, ఎస్.ఏ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న పి.వి.ఎం. నాగ జ్యోతి కి సావిత్రిబాయి ఫూలే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో “ఉపాధ్యాయ రత్న --2026” అవార్డును ఘనంగా ప్రదానం చేశారు.ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం ఆదివారం విశాఖ ప్రెస్ క్లబ్లో విద్యావేత్తలు, సామాజికవేత్తలు, ఉపాధ్యాయులు, వివిధ రంగాల ప్రముఖుల సమక్షంలో నిర్వహించారు . నాగ జ్యోతి విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఆదర్శ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారు.ఆధునిక ఐసీటీ ఆధారిత బోధన, సృజనాత్మక బోధనా పద్ధతులు, డిజిటల్ కంటెంట్ వినియోగం ద్వారా తరగతి గదులను ఉత్సాహభరితమైన అధ్యయన కేంద్రాలుగా మార్చినందుకు అవార్డు కమిటీ ప్రత్యేకంగా ప్రశంసించింది. అకడమిక్ రంగంతో పాటు స్కౌట్స్, గైడ్స్ కెప్టెన్‌గా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి పెంపొందించడంలో ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తించారు. అలాగే డ్రాప్‌ఔట్ పిల్లలను తిరిగి బడికి చేర్చడం,సామాజిక సేవా కార్యక్రమాలు, ఎన్‌జీఓలతో సమన్వయం వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆమె పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. అంతేకాక, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్‌గా భారతదేశానికి పలు అంతర్జాతీయ పతకాలు సాధించి విద్యార్థులకు క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, ఆరోగ్య జీవన విలువలను ప్రేరణగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు స్వీకరించిన నాగ జ్యోతి మాట్లాడుతూ, ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో విద్యా--సామాజిక రంగాల్లో సేవలు కొనసాగిస్తానని తెలిపారు.

### జూనియర్ ఇంజనీర్‌గా

# నియామకమైన శరత్చంద్ర

మాడుగుల జనవరి 11, జయ జయహే



మాడుగుల మండలంలో పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తూ రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో ఉద్యోగ సాధించి జూనియర్ ఇంజనీర్ గా బాధ్యతలు స్వీకరించాడు వేగి శరత్ చంద్ర.కేజీపురం గ్రామానికి చెందిన బిజెపి అప్పారావు కుమారుడైన శరత్ చంద్ర గత ఐదేళ్లపాటు మాడుగుల ఎం కృష్ణ పురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గా పనిచేశారు. అయితే మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలన్న ఉద్దేశంతో ఆర్ఆర్బి పరీక్షలకు హాజరయ్యాడు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో అతడిని విజయవాడ డివిజన్లో సౌత్ సెంట్రల్ రైల్వే జోన్లో జూనియర్ ఇంజనీర్ గా నియమించారు. ప్రస్తుతం సికింద్రాబాద్లో శిక్షణ పొందుతున్న ఇతడు తన విజయానికి మాడుగుల ఎండిఓ కే అప్పారావు ప్రధాన ప్రోత్సాహంతో పాటు తన తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంత ఉందన్నారు.

# పదో రోజుకు చేరిన నిరసన దీక్షలు

### సంక్రాంతి అనంతరం ఉద్యమ ఉధృతం

చోడవరం జనవరి 11, జయ జయ హే




గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభించాలని,చెరుకు రైతులకు,కార్మికులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, అఖిలపక్ష పార్టీలు చేస్తున్న నిరసన దీక్షలు 10వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ నల్ల రిబ్బన్లు నోటికి ధరించి మౌన ప్రదర్శన చేపట్టారు.ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత వైసిపి పాలనలో లిక్కర్, తిరుపతి లడ్డు కల్తీ, లలో అవినీతి, కుంభకోణాలు జరిగాయని, వాటి పై విచారణ చేపడతామని వందల కోట్లు రూపాయలు ఖర్చు పెడుతున్నాయని, కానీ లక్షలాదిమంది ఆధారపడిన షుగర్ ఫ్యాక్టరీలను కాపాడటానికి దృష్టి సారించటం లేదని విమర్శించారు. సంక్రాంతి పండుగ ముందు ప్రభుత్వం స్పందించకుంటే, పండగ అనంతరం పోరాటాన్ని ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు.రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు మాట్లాడుతూ, పంచదారకు మార్కెట్ లేదు కనుక ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న పండించాలని, దాని ఆధారంగా డిస్టలరీ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రచారం చేస్తున్నారని, అది పిపిపి పద్ధతిలో ఏర్పడబోతుందని చెబుతున్నారు. కానీ ఇప్పటికే అమెరికా, బ్రిటన్ లాంటి సామ్రాజ్యవాద దేశాల ఒప్పందాల కారణంగా మనదేశంలో మొక్కజొన్న దిగుమతుల పెరిగి, రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని, కావున షుగర్ ఫ్యాక్టరీని కొనసాగిస్తూ, అనుబంధంగా డిస్టలరీ ప్లాంట్ ఏర్పాటు చేస్తే మాత్రమే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, లేకుంటే అది కేవలం ప్రైవేట్ పారిశ్రామిక వేత్తలకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు.ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు శరగడం రాము నాయుడు, జనసేన నాయకులు పీలా మహేష్ లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారంలోకి వచ్చే ముందు ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీలు ఇచ్చారని, దానిని నమ్మే ప్రజలంతా ఓటు వేసారని, కానీ నేడు ఫ్యాక్టరీని మూత పెట్టి రైతులను, కార్మికులను రోడ్డున పడేసే విధంగా చర్యలు తీసుకోవడం సరైనది కాదని, దీనివలన ప్రభుత్వానికి, కూటమి నాయకులకు చెడ్డ పేరు వస్తుందని, భవిష్యత్తులో పార్టీకి నష్టం జరుగుతుందని, ఇప్పటికైనా ప్రజలకు జరిగిన అన్యాయాన్ని కొంతమేరకైన సరిచేయాలనుకుంటే రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించి, ఫ్యాక్టరీ క్రషింగ్ వచ్చే ఏడాదైన పునః ప్రారంభించాలని కోరారు. ఇంకా కార్మిక సంఘ నాయకులు రాయి సూరిబాబు,శరకాన అప్పలనాయుడు,పొట్నూరి అప్పలరాజు,బివీ నూకరాజు మాట్లాడారు. పాచిలివాని పాలెం రైతులు పోతల రమణ,రొంగలి వెంకటరావు, అఖిలపక్ష పార్టీ నాయకులు శానాపతి సత్యారావు, ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు మురళీకృష్ణ రాజు,ఏడువాక శ్రీనివాసరావు,పాశిల రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# సంక్రాంతి కానుక ఎక్కడ బాబూ..





### బాపు ఆనంద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

### ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**విశాఖపట్నం (జయ జయహే)**


సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ సంక్రాంతి కానుక ఎక్కడ అని వైసీపీ మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ సమన్వయ కర్త వాసు పల్లి గణేష్ కుమార్ సూటిగా ప్రశ్నించారు. 31 వ వార్డు సరస్వతి పార్క్ కనకల దిబ్బ వీధిలో వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాసుపల్లి ముఖ్యఅతిథిగా హాజరై వివిధ సంస్కృతిక సాంప్రదాయ కార్యక్రమాలు ఆటలు పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు వాసుపల్లి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ సర్కార్ అందజేసిన కంది పప్పు సైతం ఇవ్వలేని అసమర్ధ కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఎంతో గొప్పగా చెప్పిన రు 20 కిలో గోధుమ పిండి కేవలం పట్టణాల్లోనే అది కూడా అరకొరగా ఇస్తున్నారని మండి పడ్డారు. రేషన్ డిపోలో కేంద్రం ఉచిత బియ్యం ఇస్తుందని గుర్తు చేశారు. కూటమి కేవలం పంచదార రాగులు మాత్రమే ఇవ్వడం విడ్డురం అన్నారు. గత వై ఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముఖ్యమైన పండగలకు కిలో పంచదార ఇచ్చేవరని పేర్కొన్నారు. తెలుగు ప్రజల పెద్ద ప పండగ సంక్రాంతి అన్నారు. బంధుమిత్రులు స్నేహితుల అనుబంధానికి ప్రతీక ఈ పండగ అన్నారు. పట్టణాల్లో కూడా సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతుంది అని సంతోషం వ్యక్తం చేశారు. గాలిపతాలు పిల్లలతో పాటు పెద్దలకు కూడా ఎగురావేయడం సంప్రదాయం అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో నాగరాజు, మోహన్, గంట శ్రీను, నాయుడు, బాబురావు, రాము మాస్టర్, ధోని, త్రినాధ్, కనుకులు, రామ, దుర్గ, సత్య, మహేష్,సౌత్ సోషల్ మీడియా ప్రెసిడెంట్ బేవర మహేష్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన రూరల్ ఎస్సై

**శ్రీకాళహస్తి,జయజయహే.**

మండలంలోని వేలవేడు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ను రూరల్ ఎస్సై వెంకటేష్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... యువత విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆయన సూచించారు, చుట్టుపక్కల గ్రామాల యువతకు ఆదర్శంగా నిలుస్తున్న వెలవేడు యువతను అభినందించారు,ఈ క్రికెట్ టోర్నమెంట్ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాల గురునాథం కుమార్,మెరస దివాకర్,గంగలపూడి కెప్టెన్ చేమూరి.సురేష్,పోలయ్య,లోకేష్, వెంకటేష్,బాపన శ్రీధర్, చెంచయ్య ,జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలసిన రంగినేని చెంచయ్య నాయుడు

**శ్రీకాళహస్తి,జయజయహే.**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుని శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియామకం అయిన చెంచయ్య నాయుడు సీఎంని కలసి అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రం అందజేశారు.



## ఢిల్లీని పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి,జయజయహే.**

నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదివారం ఢిల్లీ బాబును పరామర్శించారు. ఢిల్లీ బాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ పేట బాలాజీ, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, కళతురు కుమార్, ప్రెసిడెంట్ రాము శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కొట్టే అనిల్ ,కోరా రాకేష్ లు పాల్గొన్నారు.

## తొట్టంబేడు ఎస్సై బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ సుబ్బయ్య

**తొట్టంబేడు,జయజయహే.**



తొట్టంబేడు మండలం ఎస్సైగా బాలకృష్ణ ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయనను తొట్టంబేడు పంచాయతీ సర్పంచ్ సుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిసి దుశ్యాలువ కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ముందస్తుగా ఎస్సై బాలకృష్ణకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు శాంతి భద్రతలుకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ ని కోరారు.

# కాలినడకన సింహాచలం యాత్ర



**మాడుగుల జనవరి 11, జయ జయహే**

మాడుగుల మండలం కేజే పురం, వండర్లపాలెం గ్రామాల్లో సింహాద్రి అప్పన్న స్వామి మాల ధరించిన భక్తులు ఆదివారం కాలినడకన సింహాచలం బయలుదేరి వెళ్లారు. ధనుర్మాసం ప్రారంభం రోజున వారంతా ప్రతి ఏడాది సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామి వారి మాలలు ధరించి నెలరోజుల దీక్ష అనంతరం పాదయాత్రతో సింహాచలం చేరుకుని స్వామివారిని దర్శించు కావడం ఆనవైతిగా వస్తుంది. దానిలో భాగంగానే కూడా ఒక కేజీ పురం నుంచి 30 మంది భక్తులు బయలుదేరగా చోడవరం పరిసర ప్రాంతాల నుంచి కూడా మరి కొంతమంది భక్తులు ఈ యాత్రలో చేరుతారని తెలిపారు. విరుతోపాటు మాలదరించని భక్తులు కూడా పాదయాత్రతో సింహాచలం బయలుదేరారు. వీరందరికీ కేజపురం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## జనసేన వీరమహిళా విభాగం బలోపేతంపై నాయకుల చర్చ

**రాజమహేంద్రవరం, జయజయహే:**



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో టీవీ రామారావు జనసేన నియోజకవర్గ ఇంచార్జ్‌గా పునర్నియమితులైన సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ డైరెక్టర్, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి వైశాలి పాల్గొని కార్యకర్తలకు ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా జనసేన కొవ్వూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు కడదారి నవ్య, వైశాలి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో జనసేన వీరమహిళా విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సుదీర్ఘంగా చర్చించారు. మహిళలను రాజకీయంగా చైతన్యవంతులను చేయడం, పార్టీ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడం, క్షేత్రస్థాయిలో మహిళా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేయడం వంటి అంశాలపై వైశాలి విలువైన సలహాలు, సూచనలు అందించారు. రాబోయే రోజుల్లో మహిళా విభాగం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశం జనసేనలో మహిళా నాయకత్వానికి మరింత బలం చేకూర్చిందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.




## బొజ్జల క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -2 విజేత కన్నా క్రికెట్ క్లబ్ టీమ్

**శ్రీకాళహస్తి,జయజయహే.**

శ్రీ కాళహస్తి ఆర్ట్స్ కాలేజి గ్రౌండ్ లో జరుగుతున్న బొజ్జల క్రికెట్ టోర్నమెంట్ సీజన్ - 2 ఫైనల్ మ్యాచ్‌లో కన్నా క్రికెట్ క్లబ్, సింగమాల టిమ్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కన్నా క్రికెట్ క్లబ్ విజయం సాధించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా విజేత జట్టుకు రూ. 50000 రూపాయలు, రెండవ స్థానంలో నిలిచిన సింగమాల జట్టుకు 25000 రూపాయలు బహుమతి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.



## సింహాచలంలో సంక్రాతి సంబరాలకు ఏర్పాట్లు

### వరాహనాధుని దర్శన వేళల్లో భారీ మార్పులు

### 14న నీలాద్రి గుమ్మం వరకే దర్శనాలు

### 18న తెప్పోత్సవం.. 19న ఆర్జిత సేవలు రద్దు

**సింహాచలం, జనవరి 11, జయ జయ హే**



సింహాచలం శ్రీ వరాహ లక్ష్మి నృసింహా స్వామి సన్నిధిలో సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే స్వామి వారిని పండుగ వేళల్లో దర్శించుకునే భక్తుల సంఖ్య కూడా భారీగా వుండొచ్చనే సాంకేతాలతో దర్శనం వేళల్లో మార్పులు కూడా చేశారు. భోగి, సంక్రాతి, కనుమ పర్వదినాలు సందర్బంగా దర్శన వేళలు తగ్గించారు. 14న ఉదయం 7నుంచి రాత్రి 7వరకు నీలాద్రి గుమ్మం వరకే దర్శనాలు కల్పిస్తారు. అలాగే ఆయా రోజుల్లో మధ్యాహ్నం 2.30నుంచి 3.30గంటల వరకు స్వామి వారి పవళింపు సందర్బంగా దర్శనాలు ఉండవని ప్రకటించారు. 16, 18తేదీల్లో సాయంత్రం 6గంటల వరకు, 19వ తేదీన రాత్రి 7గంటల వరకు మాత్రమే దర్శనాలు ఉంటాయి. 19న ఆర్జీత సేవలన్నీ పూర్తిగా రద్దు చేశారు. భక్తులు అందుకు తగ్గట్టుగా ఏర్పాటు చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

For a pure tomorrow.. జయహే



# సమ్మక్క సారలమ్మ జాతర
# తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక

**ప్రపంచానికి జాతరను పరిచయం చేస్తాం.**

**జాతర కోసం 251 కోట్లు వేచిస్తున్నాం.**

**15 కల్లా జాతర పనులు పూర్తి.**

**మేడారం లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**(జయ జయహే):**

సమ్మక్క సారలమ్మ జాతర కేవలం గిరిజనుల పండుగ మాత్రమే కాదు ఈ వేడుక తెలంగాణ గుండె చప్పుడు ఆత్మ గౌరవ ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మేడారంలో జాతర పనులను మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అద్లూరి లక్ష్మణ్ తో కలిసి జాతర ఏర్పాట్ల పై సమీక్షించి తదుపరి మీడియా తో మాట్లాడారు. ఆతరువాత అమ్మవారులను దర్శించుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతర విశిష్టతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా శాశ్వత నిర్మాణాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు జరుగుతున్నాయని తెలిపారు. ఈ జాతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం 251 కోట్లు ఖర్చు చేస్తుందని ఇందులో జాతర నిర్వహణ కోసం 150 కోట్లు శాశ్వతంగా గుడి నిర్మాణ పనులకు గాను 101 కోట్లు విచ్చిస్తున్నట్టు వివరించారు. నిధుల ఖర్చు చేయాల్సిన పనులు అన్ని విషయాలను మేడారంలో సమీక్షించి ఇక్కడికి ఇక్కడే నిర్ణయాలు చేసినట్టు డిప్యూటీ సీఎం మీడియాకు వివరించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి కాబోతున్నాయని తెలిపారు. ఇప్పటికీ జాతర పనులు సగటున 85శాతం పూర్తి చేశారు. మిగిలిన పనులు 15వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. జాతర సందర్భంగా అవసరమైన నిధులు విడుదల చేశాం, పూర్తి చేసిన పనులకు 24గంటల్లో బిల్లులు మంజూరు చేస్తున్నామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. గతం లో జాతర నిర్వహణకు 75 కోట్లు, 100 కోట్లు ఖర్చా చేస్తే తమ ప్రభుత్వం 251 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు.ప్రధానంగా ఆరోగ్య, విద్యుత్, పంచాయతీ శాఖ అధికారులు జాతర పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని వీరితో పాటు యావత్ శాఖల సిబ్బంది అధికారులు జాతర ను సీరియస్ గా తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, మేడారానికి ఈ రోజు ప్రతి గంటకు సగటున వెయ్యి వాహనాలు చేరుకున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో వాహనాల రాక మరింతగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ రోజు దాదాపు ఐదు లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని వెల్లడించారు. మేడారం జాతర పనులపై తాను అక్కడే ఉ ండి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జాతర సమయంలో ప్రజల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తొక్కిసలాట వంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రౌడ్ కంట్రోల్‌కు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు తమ శాఖ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు.అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మేడారం జాతరను కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మేడారం జాతర తెలంగాణ గుండె చప్పుడుగా, ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. జాతరకు సంబంధించిన నిధులు, అవసరమైన సామగ్రి అన్నింటినీ తక్షణమే మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి రానున్న నేపథ్యంలో అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జాతర పర్యవేక్షణ కోసం రూ.150 కోట్లను విడుదల చేశామని, ఇందులో దేవాలయానికి మాత్రమే రూ.101 కోట్లను వెచ్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ మేడారం మహాజాతరను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# మేడారం జాతర పనులపై ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్ష
## మేడారం మాస్టర్ ప్లాన్‌తో దర్శన సామర్థ్యం పెంపు

**(జయ జయహే):**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మేడారం జాతర పనుల పురోగతిపై ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేడారంలో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర తొలుత జాతర పనుల వివరాలను మంత్రులకు వివరించారు. దాదాపు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ నెల 15వ తేదీలోపు పూర్తిచేస్తామని ఆయన వెల్లడించారు. ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించిన కొన్ని పనులు స్వల్పంగా మిగిలి ఉ న్నప్పటికీ, నిత్యం భక్తుల రద్దీ దృష్ట్యా కొంత ఆలస్యం అయినా నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మేడారం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మేడారం ప్రాంతాన్ని పూర్తిగా కోర్ ఏరియా, పెరిఫెరల్ ఏరియాలుగా విభజించినట్లు కలెక్టర్ తెలిపారు. కోర్ ఏరియాలో కేవలం దేవాలయ ప్రాంతం మాత్రమే ఉండేలా రూపకల్పన చేశామని చెప్పారు. గత జాతరలో కోర్ ఏరియా విస్తీర్ణం సుమారు 32 వేల చదరపు అడుగులు ఉ ండగా, ఈసారి దాన్ని 54 వేల చదరపు అడుగులకు పెంచినట్లు వివరించారు. గతంలో ఒకేసారి సుమారు 3 వేల మంది భక్తులు దర్శనం చేసుకునే అవకాశం ఉండగా, ఈసారి ఒకేసారి 8 వేల మంది భక్తులు దర్శనం చేసుకునేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించినట్లు తెలిపారు. మేడారం జాతర లైవ్ కవరేజ్‌కు అనుకూలంగా నాలుగు మీడియా వాచ్ టవర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.గద్దెల ప్రాకారాన్ని గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా రూపొందిస్తూ మొత్తం 8 గేట్లను నిర్మించామని, ప్రాకార గోడలపై ఆదివాసీ జీవనశైలి ప్రతిబింబించేలా ప్రత్యేక శిల్పాలను చెక్కినట్లు కలెక్టర్ సమీక్ష సమావేశంలో వివరించారు. జాతర ఏర్పాట్లన్నీ సంప్రదాయాలకు భంగం కలగకుండా, భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టినట్లు అధికారులు మంత్రులకు



వివరించారు.అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులతో పనుల పురోగతిని విడివిడిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ శాఖ పనులను నిర్దిష్ట గడువులోగా అన్ని పనులు తప్పనిసరిగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జాతర క్యూ లైన్లకు సంబంధించిన పనుల పురోగతిని ఈఈ పంచాయతీ రాజ్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రెండు క్యూ లైన్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రాకారం మరియు క్యూ లైన్ మధ్య సుమారు 12 అడుగుల లోతు వ్యత్యాసం ఉన్న ప్రాంతాలను మట్టితో నింపి ఈ నెల 15లోపు పూర్తి చేస్తామని తెలిపారు. క్యూ లైన్‌ల కోసం మొత్తం 1,086 రైలింగ్ ఫ్యాబ్రికేషన్ సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.దేవాలయ పరిసరాల్లో ల్యాండ్‌స్కేపింగ్ పనులపై జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ వివరణ ఇచ్చారు. ఆలయం వెనుక భాగంలో ఒక భాగం పనులు పూర్తయ్యాయని, మరో ప్రాంతంలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.విద్యుత్ శాఖకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు మంత్రికి వివరించారు. రెండు సబ్ స్టేషన్ల నుంచి మేడారానికి విద్యుత్ సరఫరా చేస్తున్నామని, షార్ట్ సర్క్యూట్‌లు, విద్యుత్ చోరీలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.పారిశుద్ధ్య పనులపై డీపీఓ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి, కుంభమేళాను ఉదాహరణగా తీసుకుని అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలను మేడారంలోనూ అనుసరించాలని ఆదేశించారు. పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు.రవాణా ఏర్పాట్లపై ఆర్టీసీ డీఎం వివరాలు అందజేశారు. జాతర కోసం మొత్తం 3,600 బస్సులను 51 పాయింట్ల నుంచి నడుపుతున్నామని తెలిపారు. గత జాతరలో సుమారు 16 లక్షల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా, ఈ ఏడాది దాదాపు 20 లక్షల మంది భక్తులు బస్సుల్లో జాతరకు రానున్నట్లు అంచనా వేస్తున్నామని వెల్లడించారు. ప్రజారోగ్యంపై ములుగు జిల్లా డీఎంహెచ్‌వో శాఖ పనులను వివరించారు. గద్దెల సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపంలో 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేశామని, అలాగే 30 పిరిఫెరల్ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనంగా '108' అంబులెన్స్ 30 అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి, 24ఇ7 స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ సుదీర్ రామ్‌నాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు. జాతర విధులకు మొత్తం 13 వేల మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. 480 సీసీ కెమెరాలు, 20 డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేశామని, నేర నియంత్రణ కోసం పొరుగు జిల్లాల నుంచి ప్రత్యేక బృందాలను కూడా మోహరించినట్లు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దేవాలయ లైటింగ్‌కు సంబంధించి, టీటీడీలో పని చేసిన అనుభవం కలిగిన ప్రత్యేక ఏజెన్సీని నియమించినట్లు అధికారులు మంత్రులకు వివరించారు. లైటింగ్ ప్రోటోటైప్‌ను మంత్రులకు ప్రదర్శించగా, లైటింగ్ పూర్తిగా ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని మంత్రులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, మేడారానికి ఈ రోజు ప్రతి గంటకు సగటున వెయ్యి వాహనాలు చేరుకున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో వాహనాల రాక మరింతగా పెరిగే అవకాశం ఉ ందని పేర్కొన్నారు. ఈ రోజు దాదాపు ఐదు లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని వెల్లడించారు. మేడారం జాతర పనులపై తాను అక్కడే ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జాతర సమయంలో ప్రజల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తొక్కిసలాట వంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు.



# 'చేనేత'లకు సంక్రాంతి శుభవార్త

**సహకార సంఘాలకు**

**రూ.5 కోట్ల బకాయిల విడుదలకు మంత్రి సవిత ఆదేశం**

**చేనేత సహకార సంఘాల ఖాతాల్లో**

**రూ.5 కోట్ల బకాయిల జమ**

**సీఎం చంద్రబాబుకు, మం త్రి సవితకు ధన్యవాదాలు తెలిపిన చేనేత సహకార సంఘాల ప్రతినిధులు**

**అమరావతి (జయ జయహే):**

చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సంక్రాంతి ముంగిట శుభవార్త తెలిపారు. ఆప్కో బకాయిల్లో రూ.5 కోట్లు చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో చేనేత సహకార సంఘాల నుంచి చేనేత వస్త్రాల కొనుగోలుకు సంబంధించి మరో విడత బకాయిలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. గత నెలలో రూ.2.42 కోట్ల మేర బకాయిలను చేనేత సహకార సంఘాలకు చెల్లించామన్నారు. సంక్రాంతి పండగ దృష్ట్యా మరో రూ.5 కోట్లు చెల్లించాలని ఆప్కో యాజమాన్యాన్ని మంత్రి సవిత ఆదేశించారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు సోమవారం చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో బకాయిలు జమ చేయడానికి ఆప్కో సిద్ధమైంది. చేనేత సహకార సంఘాల ఆర్థిక బలోపేతానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి పొందేలా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అదే సమయంలో సామూహికంగా చేనేత సహకార సంఘాల ద్వారా లబ్ధి కలిగేలా మరికొన్ని పథకాలు వర్తింపజేస్తున్నామన్నారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడంతో పాటు నూతన కొనుగోళ్లను సైతం ప్రారంభించినట్లు మంత్రి సవిత తెలిపారు. నేతన్నలు గౌరవప్రదమైన జీవనం సాగించడంతో 365 రోజులూ వారికి ఉపాధి కల్పించాలన్నది సీఎం చంద్రబాబునాయుడి లక్ష్యమన్నారు. నేతన్నలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే...మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. చేనేత ఉత్పత్తుల విక్రయాల పెంపుదలకు కో ఆప్టెక్స్, టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్ తో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ముఖ్యంగా ఈ కామర్స్ లో దిగ్గజ సంస్థలైన ఫ్లిప్ కార్ట్, అమెజాన్, జియో మార్ట్, ఓఎన్డీసీ ద్వారా ఆన్ లైన్ లో చేనేత దుస్తుల అమ్మకాలను ప్రారంభించామన్నారు. నేటి తరం అభిరుచులకు అనుగుణంగా రెడీమేడ్ చేనేత వస్త్రాలను తయారు చేయించి, ఆప్కో షో రూమ్ లతో పాటు ఆన్ లైన్ లోనూ అమ్మకాలు చేస్తున్నామన్నారు నేతన్నలకు రెడీమేడ్ దుస్తుల తయారీపై శిక్షణ సైతం అందజేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా చేనేత అమ్మకాలు ఊపందుకున్నాయని మంత్రి సవిత తెలిపారు. సంక్రాంతి ముంగిట రూ.5 కోట్ల బకాయిల చెల్లింపు చేయడంపై చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేశారు.




# గురుబ్రహ్మ జాతీయ పురస్కారం పొందిన పిచ్చమ్మ

**చోడవరం జనవరి 11, జయ జయహే**

చోడవరం డిగ్రీ కళాశాల లో కామర్స్ అధ్యాపకురాలు , జాతీయ సేవా పథకం యూనిట్ -2 ప్రోగ్రామ్ ఆఫీసర్ గా నాలుగు ఏళ్లుగా సేవలు అందిస్తున్న బి పిచ్చమ్మకు గురుబ్రహ్మ జాతీయ అవార్డు లభించింది. ఒకపక్క అధ్యాపకురాలుగా, మురపక్క ఎన్ఎస్ఎస్పిఓగా వివిధ మెడికల్ క్యాంపు లు, పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు,వివిధ గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఉత్తమ సేవలను అందిస్తున్నందుకుగాను ఆదివారం విశాఖ ప్రెస్ క్లబ్లో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేసినట్లు నిర్వాహకులు పి. కృష్ణ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్. ఎస్ ఎస్ సేవలను గుర్తించి, విద్యా సేవలను గుర్తించి నందులకు ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బుల్లా. పిచ్చమ్మ ఆనందం వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో పట్టాసి చలపతిరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అరకులోయ, ఎం.కృష్ణా రావు, ఇంగ్లీష్ అసిస్టెంట్, నాగ జ్యోతి, పొన్నాడ శ్రీరామ మూర్తి హెడ్ మాస్టర్, ఎం. పీ. పీ ఎస్, బింకిలి, వీరు ఈ కార్యక్రమంలో పాల్గొని పిచ్చమ్మ సేవలు కొనియాడారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com